సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 3 । జనవరి । 2023

వైకుంఠ వైభవం


యాదాద్రిలో అధ్యయనోత్సవాల్లో భాగంగా మత్స్య అలంకారంలో యాదాద్రీశుడు


ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


గరుడవాహనంపై ఆలయ తిరువీధిలో ఊరేగుతున్న వైకుంఠనాథుడు

న్యూస్‌రీల్

సావిత్రిబాయి పూలే అవార్డుకు పోతిరెడ్డిపల్లి సర్పంచ్


గనగాని మాధవి

ఆత్మకూరు(ఎం) : సావిత్రిబాయి పూలే రాష్ట్ర స్థాయి అవార్డుకు ఆత్మకూరు(ఎం) మండలం పోతిరెడ్డిపల్లి సర్పంచ్ గనగాని మాధవి ఎంపిక య్యారు. గ్రామస్థాయిలో చేపడుతున్న అభివృద్ధి మరియు సామాజిక సేవలకు గుర్తింపుగా ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన పది మందిలో యాదాద్రి జిల్లా నుంచి పోతిరెడ్డిపల్లి సర్పంచ్ ఒకరు. సావిత్రిబాయి పూలే 192వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 3వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డు ప్రదానం చేయనున్నారు. అవార్డుకు ఎంపికైన మాధవిని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బీసు చందర్‌గౌడ్, గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గనగాని మల్లేశంగౌడ్ అభినందించారు.

బోధనేతర సిబ్బంది పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : జిల్లాలోని బాలికల కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొమ్మలరామారం మోడల్ స్కూల్, భువనగిరి కేజీబీవీలో రెండు సహాయ వంట మనుషులు, భూదాన్‌పోచంపల్లి మోడల్ స్కూల్‌లో ఏఎన్‌ఎం, కేర్‌టేకర్ పోస్టులు ఒక్కొక్కటి ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. సహాయ వంట మనిషి పోస్టుకు 7వ తరగతితో పాటు అనుభవం, ఏఎన్‌ఎం పోస్టుకు ఇంటర్‌తో పాటు సంబంధిత కోర్సుల్లో ట్రైనింగ్ పూర్తి చేసి ఉండాలని, కేర్ టేకర్ పోస్టుకు డీగ్రీ, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఏఎన్‌ఎం కోసం డీఈఓ కార్యాలయంలో మిగిలిన పోస్టులకు ఎంఈఓ కార్యాలయంలో ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాల కోసం సెల్ నంబర్ 9573153233ను సంప్రదించాలని కోరారు.

నారసింహుడి సేవలో ప్రముఖులు


ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌కు ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి రాజు

యాదగిరిగుట్ట : వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, డీసీపీ నారాయణరెడ్డి, ఆర్డీఓ భూపాల్‌రెడ్డి తదితర ప్రముఖులు దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలకు, ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన చేశారు. వారికి ఆచార్యులు ఆశీర్వచనం చేసి ప్రసాదం అందజేశారు.

జాండ్ర మఠం పునరుద్ధరణకు కృషి


జాండ్ర మఠాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

ఆలేరురూరల్ : మండలంలోని కొలనుపాకలో వైటీడీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న సోమేశ్వారాలయం పునరుద్ధరణ పనులను సోమవారం పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా జాండ్ర మఠాన్ని ఆయన సందర్శించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 18 మఠాలు కొలనుపాకలో ఉన్నాయన్నారు. ఇందులో తొమ్మిదవ శతాబ్దం నాటి జాండ్ర మఠాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఆలయ అర్చకులు సోమయ్యస్వామి, గంగాధర్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

పరిహారం చెల్లించే వరకు నిరాహార దీక్ష

భువనగిరి : బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపురం నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 35వ రోజుకు చేరాయి. నిర్వాసితులకు పరిహారం చెల్లించే వరకు దీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిన్నం లతరాజు, ఎంపీటీసీ ఉడుత శారధ అంజనేయులు, ఉప సర్పంచ్ ఎడ్ల దర్శన్‌రెడ్డి, జిన్న కృష్ణ, నర్సింహ, ఉప్పలయ్య, వెంకటేష్, శంకరయ్య, మల్లేష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం.. జాప్యం

రేషన్ షాపులకు చేరని స్టాక్
- గత నెల హమాలీల కొరత
- ఈసారి కోటా కేటాయించని రాష్ట్రం
- ఎదురుచూపుల్లో లబ్ధిదారులు
- మరో ఐదు రోజులు పట్టే అవకాశం
- గోదాముల్లోనే కేంద్ర వాటా బియ్యం



సాక్షి, యాదాద్రి : పౌర సరఫరాల చౌక దుకాణాలకు ఇప్పటి వరకు బియ్యం రాలేదు. ప్రతి నెలా 1నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తారు. కేంద్రం తన వాటా ఇచ్చినప్పటికీ రాష్ట్రం కేటాయించకపోవడంతో జాప్యం జరుగుతోంది. అందుబాటులో ఉన్న కేంద్ర బియ్యం స్టాక్ పాయింట్లలోనే మూలుగుతోంది. రాష్ట్రం కేటాయించే వరకు లారీలు కదిలే పరిస్థితి కనిపించడం లేదు. గత నెలలోనూ హమాలీల కొరత కారణంగా సకాలంలో బియ్యం పంపిణీ చేయలేకపోయారు.

రేషన్ కార్డులు ఇలా..

జిల్లాలో మొత్తం 2,16,745 రేషన్ కార్డులు, 6,62,187 యూనిట్‌లు ఉన్నాయి. ఇందులో 2,03,176 ఆహారభద్రత కార్డులు 6,26,524 యూనిట్లు ఉన్నాయి. అంత్యోదయ కార్డులు 13,569, యూనిట్లు 35,663 యూనిట్లు ఉన్నాయి. వీరందరికీ కరోనా కాలం నుంచి కేంద్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం ఇస్తుంది. అయితే తన వాటాను ఈ ఏడాది డిసెంబర్ 31వరకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నెల 3వ తేదీ వచ్చినా బియ్యం సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారులు రేషన్ షాపుల చుట్టూ తిరిగిపోతున్నారు. కార్డుదారులకు రేషన్‌డీలర్లు సమాధానం చెప్పలేకపోతున్నారు.

ఎవరి వాటా ఎంతంటే..

జిల్లా వ్యాప్తంగా 17 మండలాలు, ఆరు మున్సిపాలిటీల్లో 515 చౌక ధరల దుకాణాల ద్వారా ప్రతి నెలా బియ్యం పంపిణీ జరుగుతుంది. జనవరి మాసానికి కేంద్రం తన వాటా బియ్యం 3,310.935 మెట్రిక్ టన్నులు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వ కోటా 3,607.535 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉంది.

సకాలంలో స్టాక్ వివరాలివ్వని డీలర్లు

కేంద్ర, రాష్ట్రాలు ఇస్తున్న ఉచిత బియ్యం పంపిణీ అయోమయంగా మారింది. గత నెలకు సంబంధించి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రేషన్ డీలర్లు తమవద్ద ఉన్న స్టాక్ వివరాలు ఆలస్యంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. బియ్యం మిగులు లెక్కలు సకాలంలో తేలకపోవడంతో ఈనెల కోటా కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం వద్ద జాప్యం జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కేంద్రం బియ్యం సివిల్ సప్లై గోదాముల వద్ద నిలిచిపోయింది. రాష్ట్రం తన వాటా కేటాయించే వరకు లారీలు కదిలే పరిస్థితి లేదు. ఎందుకంటే రేషన్ షాపులకు రెండుసార్లు బియ్యం సరఫరా చేయాలంటే ఖర్చుతో కూడుకున్నది. అంతేకాకుండా డీలర్లు సైతం రెండుసార్లు బియ్యం పంపిణీ చేయడానికి ఇష్టపడడం లేదని తెలుస్తోంది. పది కిలోలు రెండు విడతలు పంపిణీ చేయాలంటే నెలంతా రేషన్ దుకాణాల్లో ఇతర పనులు వదులుకొని ఉండాలి. ఈ నేపథ్యంలో రాష్ట్రం వాటా కేటాయింపు జరిగే వరకు బియ్యం పంపిణీ చేపట్టలేమని పలువురు డీలర్లు చెబుతున్నారు.

గత నెలలోనూ..

రేషన్ బియ్యం పంపిణీలో జాప్యానికి రాష్ట్రం తన కోటా ఇవ్వకపోగా ఒక కారణం అయితే హమాలీల కొరత కూడా ఉంది. గత నెల హమాలీల సమస్య కారణంగా రేషన్ దుకాణాలకు సకాలంలో బియ్యం సరఫరా కాలేదు. దీంతో పంపిణీలో జాప్యం ఏర్పడింది.

హమాలీలు లేక ఆలస్యం



ఈ నెల రేషన్ బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. 10వ తేదీలోగా పంపిణీ పూర్తి చేస్తాం. గత నెల కూడా హమాలీల కొరత కారణంగా బియ్యం రవాణాలో జాప్యం ఏర్పడింది. జిల్లాకు బియ్యం కోటా అందుబాటులో ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా కలిపి ప్రతి యూనిట్‌కు 10 కిలోల బియ్యం లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–ఎంవీ భూపాల్‌రెడ్డి, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్

అర్జీలను వెంటనే పరిష్కరించండి

- కలెక్టర్ పమేలా సత్పతి
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ


బాధితుల సమస్యలు వింటున్న కలెక్టర్

భువనగిరిటౌన్ : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్‌రేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి వస్తారని, వినతులను పరిష్కరించడంలో జాప్యం చేయొద్దన్నారు. వివిధ సమస్యలపై 38 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కొన్ని అర్జీలను అధికారులు అప్పటికప్పుడు పరిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

తనిఖీ చేసి లోపలికి అనుమతి

ప్రజావాణికి వచ్చినవారిని ప్రధానగేట్ వద్ద పోలీసులు తనిఖీ చేసి కలెక్టరేట్‌లోకి అనుమతిచ్చారు. ప్రజావాణి నిర్వహించిన సమావేశ మందిరంలోనూ తనిఖీ చేశారు. అర్జీలను తప్ప ఇతర వస్తువులను అనుమతించలేదు.

మాస్క్ తప్పనిసరి

కరోనా కొత్త వేరియంట్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్ నిబంధనలు అమలు చేస్తుందని, ప్రజావాణికి వచ్చేవారు తప్పనిసరిగా మాస్కు ధరించి రావాలని కలెక్టరేట్ ఏఓ నాగేశ్వరాచారి కోరారు. దీంతో చాలా మంది మాస్క్ ధరించి లైన్‌లో నిల్చొని అర్జీలు అందజేశారు. మాస్కులు లేని వారు కర్చీఫ్ ధరించారు.

వినతుల్లో కొన్ని..

- పురాతన విద్యుత్ లైన్‌ను తొలగించి టవర్‌లైన్ ఏర్పాటు చేయాలని మాజీ కౌన్సిలర్ దేవరకొండ నర్సింహ కలెక్టర్‌కు విన్నవించారు.
- ఉపకార వేతనాలు విడుదల చేయించాలని కోరుతూ వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అతహార్, నాయకులు విన్నవించారు.
- రైతుబంధు సాయం పునరుద్ధరించాలని రామన్నపేటకు చెందిన రవీందర్‌రెడ్డి కోరారు.
- బస్వాపూర్ రిజర్వాయర్‌లో చేపలు పట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలని మత్స్య పారిశ్రామిక సంఘం ప్రతినిధులు విన్నవించారు. బీఎన్ తిమ్మాపురానికి చెందినకొందరు గొడవ చేయడంతో చేపలు పట్టవద్దని భువనగిరి రూరల్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు జీఓను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.


వినతిపత్రం చూపుతున్న మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు

అభివృద్ధికి పునరంకితమవుదాం


గెట్ టూ గెదర్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, చిత్రంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, ఎంవీ భూపాల్‌రెడ్డి, అధికారులు

- కలెక్టర్ పమేలా సత్పతి
- అధికారులు, మీడియా ప్రతినిధులతో కలెక్టరేట్‌లో గెట్ టూ గెదర్

సాక్షి, యాదాద్రి : ప్రజల భాగస్వామ్యంతో జిల్లా అభివృద్ధికి పునరంకితమవుదామని, అధికార యంత్రాంగం, మీడియాతో పాటు అన్ని వర్గాలు తోడ్పాటునందించాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన గెట్ టూ గెదర్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి మాట్లాడారు. గడిచిన సంవత్సరం జిల్లాలో సమీకృత కలెక్టరేట్, యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఉద్ఘాటనతో పాటు మరెన్నో ముఖ్యమైన కార్యక్రమాలను సమష్టి కృషితో విజయవంతం పూర్తి చేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయడంలో మండల ప్రత్యేకాధికారుల పాత్ర అమోఘమన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి లోపాలను నివారించినట్లు చెప్పారు. ధరణి సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ యంత్రాంగం నిర్విరామంగా పని చేస్తుందన్నారు. గత ఏడాది 80 శాతం ఫైళ్లను క్లియర్ చేసి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచామని చెప్పారు. తనతోపాటు అధికారులు, ఉద్యోగులు సైనికుల్లా పనిచేస్తున్నారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలును ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా పాత్ర ఎంతో ఉందన్నారు. విద్య, వైద్యంతో పాటు పేదలకు లబ్ధి చేకూర్చే విషయాల్లో కీలకపాత్ర పోషిస్తూ ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ అధికార యంత్రాంగానికి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు.

జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం

వివిధ రంగాల్లో యాదాద్రి జిల్లా ముందున్నదని, కొత్త సంవత్సరంలో అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు సమష్టిగా కృషి చేద్దామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. 2023 సంవత్సతం ఇంటర్నేషనల్ మిల్లెట్ ఇయర్‌గా ఎంపికైనందున ఆరోగ్యన్యూట్రిషన్ విషయంలో మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాను ముందువరుసలో నిలపడానికి కృషి చేస్తున్నామన్నారు. మీడియా, అధికారుల భాగస్వామ్యం వారధిలా పనిచేస్తుందన్నారు.కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ కె.ఏ ఉపేందర్‌రెడ్డి, టీజీఏ జిల్లా అధ్యక్షుడు మందడి ఉపేందర్ రెడ్డి, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు జగన్, శ్యాంసుందర్‌రెడ్డి, నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

సామగ్రి అందజేత

ఉద్యోగ సంఘాల నాయకులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు నోట్ పుస్తకాలు, బెడ్‌షీట్లు, టవళ్లు, స్టేషనరీ వస్తువులను నూతన సంవత్సరం బహుమతులుగా కలెక్టర్‌కు అందజేశారు.

భూ రికార్డుల గది ప్రారంభం

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లోని సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భూ రికార్డుల గదిని కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం ప్రారంభించారు. జిల్లాలోని 319 రెవెన్యూ గ్రామాల రికార్డులు అందుబాటులో ఉంటాయన్నారు. రికార్డుల సర్టిఫై కాపీలు కావల్సిన వారు సంబంధిత బ్యాంకులో చలానా చెల్లించి రికార్డులు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్

బస్టాండ్ స్థలంలో సమీకృత మార్కెట్

- భూదాన్‌పోచంపల్లిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటుకు అడుగులు
- కొలిక్కి వచ్చిన స్థలం సమస్య
- ఆర్టీసీకి మరో చోట కేటాయింపు


ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం ప్రతిపాదించిన ఆర్టీసీ బస్టాండ్ స్థలం

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలో సమీకృత మార్కెట్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో ఏర్పాటు చేయాలని మున్సిపల్ పాలకవర్గం తీర్మానించింది. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసింది.

స్థలం కొరత వల్లే జాప్యం

మున్సిపాలిటీ ప్రజల అవసరాలకు అనుగుణంగా అధునాతన వసతులతో కూడిన ఇంటిగ్రెటెడ్ మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.2 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు ఖరారయ్యాయి. కానీ, స్థలం కొరతతో నిర్మాణానికి రెండేళ్లుగా అడుగు పడలేదు. మొదట బీసీ కాలనీలోని ఖాళీ స్థలంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అయితే స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో పద్రై కాల్వ సమీపంలో దేవాదాయ శాఖకు చెందిన 1,002, 1,003 సర్వే నంబర్లలో గల 2 ఎకరాల భూమిని అధికారులు ప్రతిపాదించి కలెక్టర్‌కు పంపించారు. కానీ, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మార్కెట్ నిర్మాణానికి అభ్యంతరం చెప్పడంతో సమస్య మొదటికి వచ్చింది. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌కు చెందిన రెండు ఎకరాల స్థలంలో మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అందుకు బదులుగా ఆర్టీసీకి కలెక్టర్ ఆదేశాల మేరకు జలాల్‌పురం పరిధిలోని సర్వే నంబర్ 80లో ఉన్న రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించారు.

వెజ్, నాన్‌వెజ్ దుకాణాలన్నీ ఒకే చోట

రెండు ఎకరాల స్థలంలో రూ.2 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటుకానుంది. ఇక్కడ వేర్వేరుగా వెజ్, నాన్‌వెజ్ షెడ్లు, పార్కింగ్, గ్రీనరీ, తాగునీరు తదితర వసతులు కల్పిస్తారు. ఒకేచోట కూరగాయలు, పండ్లు, మాంసం, చికెన్, చేపలు కొనుగోలు చేయడానికి ప్రజలకు సైతం ఎంతో సులభం కానుంది.

రోడ్డుపైనే విక్రయాలు.. ట్రాఫిక్ తిప్పలు

స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల వ్యాపారులు రోడ్డుపైన కూరగాయలు, పండ్లు, గృహావసరాల వస్తువులు అమ్ముకుంటున్నారు. రోడ్లపైన విక్రయాలు జరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.అంతేకాక కరెంట్, ఇతర మౌళిక వసతులు లేక వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. సమీకృత మార్కెట్ నిర్మాణం జరిగితే ఆ సమస్య తీరనుంది.

బస్టాండ్ స్థలాన్ని ఎంపిక చేశాం



ప్రభుత్వ స్థలం అందుబాటులో లేక మార్కెట్ నిర్మాణం ఆలస్యమైంది. నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని ఎంపిక చేసి కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి ఆర్టీసీ వారికి ప్రతిపాదనలు పంపించాం. ఇందుకు బదులు ఆర్టీసీకి జలాల్‌పురంలో 2 ఎకరాల ప్రభుత్వ భూమి చూపించాం. స్థలం ఖరారు కాగానే మార్కెట్ పనులు ప్రారంభిస్తాం.

–చిట్టిపోలు విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్

సైలెన్స్ రిట్రీట్ సెంటర్ రెడీ

- నేడు వర్చువల్ ద్వారా ప్రారంభించనున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- హాజరుకానున్న గవర్నర్ తమిళిసై

బీబీనగర్ : మండలంలోని మహాదేవ్‌పురం పరిధిలో బ్రహ్మకుమారీస్ భవనంలో ఏర్పాటు చేసిన సైలెన్స్ రిట్రీట్ సెంటర్ ప్రారంభానికి సిద్ధమైంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం రాజస్థాన్ నుంచి వర్చువల్ ద్వారా ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు. గవర్నర్‌తో పాటు మంత్రి జగదీశ్‌రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.


ప్రారంభానికి సిద్ధమైన సైలెన్స్ రిట్రీట్ సెంటర్

7లోపు పనులన్నీ పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ
- 'మన ఊరు – మన బడి' పనులపై సమీక్ష


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

భువనగిరిటౌన్ : మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో ఎంపిక చేసిన 34 మోడల్ స్కూళ్లలో గుర్తించిన పనులను ఈనెల 7వ తేదీ లోగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం అయ్యారు. మండలానికి రెండు చొప్పున ఎంపిక చేసిన 34 మోడల్ స్కూళ్లలో పనుల పురోగతిని సమీక్షించారు. కొత్త ఫర్నిచర్, గ్రీన్ బోర్డులు, నేమ్ బోర్డులు, మరమ్మతులు, పేయింటింగ్ పనులన్నీ నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కోరారు. డైనింగ్ హాళ్లు, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ఫిబ్రవరి 15వ తేదీ లోగా పూర్తి చేయాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ శంకరయ్య, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

‘శ్రీని’లో అగ్నిప్రమాదం.. కెమిస్ట్‌కు గాయాలు

చౌటుప్పల్: పట్టణ శివారులోని శ్రీని ఫార్మాస్యూటికల్ కంపెనీలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయని ఎస్‌ఐ సైదులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన వెల్ల డించారు. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం గజలాపురం గ్రామానికి చెందిన ఉగ్గిడి సాయికుమార్(25) శ్రీని పరిశ్రమలో కెమిస్ట్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శనివారం నైట్ డ్యూటీకి వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత రియాక్టర్ వద్ద వాల్వ్ తిప్పుతుండగా అధిక పీడనం ఏర్పడి మంటలు చెలరేగాయి. దీంతో సాయికుమార్‌కు మంటలు అంటుకొని గాయాలయ్యాయి. అతడిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గరిడేపల్లి: జీవితంపై విరక్తితో పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని గానుగుబండ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కొండల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గానుగుబండ గ్రామానికి చెందిన తాళ్ల శ్రీను(50) భార్య 12ఏళ్ల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి అతడు మద్యానికి బానిస అయ్యాడు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీను జీవితంపై విరక్తి చెంది ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత చుట్టుపక్కల వారు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి తల్లి పున్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

దాడి కేసులో ఐదుగురు అరెస్టు

నకిరేకల్: ప్రేమ పెళ్లి చేసుకున్న యువకుడి ఇంటిపై దాడి చేసి అమ్మాయి తీసుకెళ్లిన కేసులో ఐదుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌లోని బొడ్రాయి బజార్‌లో నివాసముంటున్న తాడూరి నవదీప్, శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన వరికుప్పల కావ్యను డిసెంబర్ 29న నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు క్షేత్రంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అమ్మాయి తండ్రి వరికుప్పల వెంకన్నతో పాటు మరికొంత మంది మరుసటి రోజు నవదీప్ ఇంటిపై దాడి చేసి అతడిని గాయపర్చి కావ్యను తమ వెంట తీసుకవెళ్లారు. ఈ మేరకు నవదీప్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అమ్మాయి తండ్రి వరికుప్పల వెంకన్నతో పాటు ఓర్సు యాదగిరి, వి. నరేష్, ఎస్. శ్రీకాంత్, షేక్ జహంగీర్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వైకుంఠ వైభవం..

- యాదాద్రి ఆలయ ఉద్ఘాటన తర్వాత తొలిసారిగా వేడుక
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు


స్వామి సేవలో మంత్రి జగదీశ్‌రెడ్డి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ విప్ సునీత


ఉత్తర రాజగోపురం వద్ద వైకుంఠ ద్వార దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహుడు సోమవారం భక్తులకు వైకుంఠనాథుడిగా దర్శనమిచ్చారు. యాదాద్రీశుడి ప్రధానాలయ ఉత్తర ద్వారం గుండా భక్త జనులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 6.30గంటలకు గరుడ వాహనంపై వైకుంఠ నాథుడిగా శ్రీనరసింహస్వామిని అలంకరించి అమ్మవారిని, ఆళ్వారాధులను అలంకార సేవలతో ప్రధానాలయం నుంచి ఉత్తర ద్వారం వద్దకు తీసుకువచ్చి పంచారాత్రా ఆగమశాస్త్ర ప్రకారం పూజలు నిర్వహించారు. ఉదయం 6.48గంటలకు నారసింహుడు ఉత్తర ద్వారం వద్ద వైకుంఠనాథుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఉదయం 3గంటలకు ఆలయం తెరచి సుప్రభాతం, ప్రాతఃకాల తిరువారధన, ధనుర్మాస తిరుప్పావై సేవా కాలం, బాలభోగం, ఆరగింపు, చాత్మురై వంటి పూజలు జరిపించి, 5.15గంటల నుంచి 6.30గంటల వరకు శ్రీస్వామిని గరుఢవాహనంపై పరవాసుదేవ అలంకారం (శ్రీలక్ష్మీనృసింహస్వామి) సేవలో ఊరేగిస్తూ 6.48గంటలకు ఉత్తర ద్వారం గుండా ద్వార భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సమయంలో ఆచార్యుల వేదమంత్రాలతో యాదాద్రి కొండ మార్మోగిపోయింది. భక్తులు యాదాద్రీశా.. జై లక్ష్మీనారసింహ అంటూ నినాదాలు చేశారు. అనంతరం తిరువీధుల్లో సేవను ఊరేగించారు.

పాతగుట్టలో...

యాదాద్రి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉత్తర ద్వారంలో నృసింహుడు వైకుంఠనాథుడిగా దర్శనమించారు. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు శ్రీ స్వామి అమ్మవార్లకు సుప్రభాతం, ఆరాధన చేపట్టారు. వైకుంఠనాథుడిగా శ్రీస్వామిని అ లంకరించి గరుడవాహనంపై ప్రత్యేక సేవలో ఉత్తర ద్వారంకు తీసుకువచ్చారు. సరిగ్గా ఉదయం 6.48 గంటలకు భక్తులకు శ్రీస్వామివారు వైకుంఠ నాథుడిగా దర్శనమిచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు క్యూలైన్ ద్వారా ముఖ మండపంలో భక్తులకు స్వామిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు.


అధ్యయనోత్సవాల్లో సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు, పారాయణీకులు

అధ్యయనోత్సవాలకు శ్రీకారం...

యాదాద్రి ప్రధానాలయంలో అధ్యయనోత్సవాలకు ఆచార్యులు ద్రావిడ ప్రబంధ సేవా కాలం పారాయణీక స్వాములచే శ్రీకారం చుట్టారు. తొళక్కముతో అధ్యయనోత్సవాలను ప్రారంభించారు. శ్రీస్వామి వారిని విష్ణుమూర్తిగా అలంకారం చేసి మత్స్యావతార సేవలో ఆగమశాస్త్రానుసారంగా శ్రీ స్వామి వారిని పురప్పాట్ సేవగా ఊరేగింపు సేవ చేపట్టారు.

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు


ఆలయ తూర్పు రాజగోపురం ముందు నృత్యం చేస్తున్న చిన్నారులు

యాదగిరిగుట్ట: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో సోమవారం సాయంత్రం శ్రీసాంస్కృతిక విశ్వకళా మండలి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. యాదాద్రీశుడి చరిత్రను తెలిపే పాటలకు అనుగుణంగా చిన్నారులు చేసిన నృత్యాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో కూచిపూడి నాట్య గురువులు డాక్టర్ ఎస్.సి. కృష్ణకుమారి, డాక్టర్ మనోజ్ఞ, సంగీత విద్వాంసులు వెంకటచార్యులు, జ్యోతిర్మయి, విశ్వకళా మండలి వ్యవస్థాపకుడు రాంనర్సయ్య తదితరులున్నారు.

మట్టపల్లి క్షేత్రానికి భక్తజనం


మట్టపల్లి పురవీధుల్లో గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

మఠంపల్లి: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించగా, అనంతరం శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ సమేతం శ్రీలక్ష్మీనరసింహస్వామి వైకుంఠ (ఉత్తర) ద్వార దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారంలోనూ, అదే విధంగా క్యూలైన్ల ద్వారా గర్భాలయంలోనూ దర్శించుకున్నారు. వైకుంఠ ద్వారం నుంచి గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను మట్టపల్లి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో లక్ష ఆరెపత్రి పూజను అర్చకులు ఘనంగా నిర్వహించారు. అంతేగాక హరికథలు, బుర్రకథ, పురాణ కాలక్షేపాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణా చార్యులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో భక్తుల కిటకిట


స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి దంపతులు, భక్తులు

రామగిరి(నల్లగొండ) : తెలంగాణలో రెండో భద్రాద్రిగా ప్రసిద్ధిగాంచిన నల్లగొండ పట్టణంలోని రామగిరిలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం (రామాలయం) వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం భక్తులతో కిటకిటలాడింది. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, భక్తులు స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చకిలం వేణుగోపాల్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు యాట జయప్రద, వేదాంతం శ్రీనివాసాచార్యులు, మిరియాల స్వామి, పాదం ప్రియాంక, హనుమంతు, కక్కిరేణి లక్ష్మీనారాయణ, ఈఓ జిల్లేపల్లి జయరామయ్య పాల్గొన్నారు.

సాగర్ ఎడమ కాల్వలో వ్యక్తి గల్లంతు


లక్ష్మణ్

మిర్యాలగూడ: వేములపల్లి మండలం రావులపెంట గ్రామ శివారులో సాగర్ ఎడమ కాల్వలో సోమవారం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామానికి చెందిన గొట్టిపర్తి లక్ష్మణ్(35) 20 సంవత్సరాలుగా నల్లగొండలో నివాసముంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఆటోలో సాగర్ ఎడమ కాల్వ మీదుగా సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపాడు గ్రామానికి వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో రావులపెంట గ్రామ శివారులో కాల్వ కట్టపై బహిర్భూమికి వెళ్లి, కాల్వలో దిగగా ప్రమాదవశాత్తు అందులో జారిపడ్డాడు. స్థానికులు గమనించి కాపాడేందుకు ప్రయత్నించగా నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులకు వెంటనే అక్కడకు చేరకుని లక్ష్మణ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. లక్ష్మణ్ భార్య రెండేళ్ల క్రితమే చనిపోగా, ఒక కుమారుడు ఉన్నాడు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

- 8తులాల బంగారు ఆభరణాలు చోరీ

హుజూర్‌నగర్ (చింతలపాలెం): తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి 8తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన చింతలపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం గ్రామానికి చెందిన ఉస్తెల పెద్దవెంకటరెడ్డి ఉదయం 10గంటల సమయంలో ఇంటికి తాళం వేసి గ్రామంలోని తన తమ్ముడి మనవరాలి అన్నప్రాసన కార్యక్రమానికి వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటం గమనించి లోపలికి వెళ్లి చూడగా, గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న సుమారు 8తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మద్యం మత్తులో యువకుల దాడి

- గోపలాయపల్లిలో విచారణ చేపట్టిన పోలీసులు


గోపలాయపల్లి గ్రామంలో విచారిస్తున్న సీఐ శివరాంరెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ

నార్కట్‌పల్లి: మండలంలోని గోపలాయపల్లి గ్రామంలో ఏడుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి గోపలాయపల్లి గ్రామంలో కొందరు యువకులు మద్యం మత్తులో పలువురిపై దాడి చేశారు. దీంతో గ్రామానికి చెందిన దేశగాని పురుషోత్తం, శ్రవణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం సీఐ శివరాంరెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ గ్రామంలో విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. దాడి చేసింది గాలి వేణు, పోషలు, తేజ, వినయ్, మచ్చ వేణు, చక్రి, అరిగెల శివగా గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. యువకులు మద్యానికి బానిస కాకుండా కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ శివరాంరెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం


హిల్‌కాలనీ డౌన్‌లో రోడ్డు దిగి గట్టు పైకి ఎక్కి ఆగిన బస్సు

నాగార్జునసాగర్: ఆటోను తప్పించబోయిన ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కకు వెళ్లి ఆగిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీ నుంచి పైలాన్ వెళ్తుండగా, ఇందిరమ్మ విగ్రహం దాటాక రోడ్డుపై లారీ ఆగి ఉంది. అదే సమయంలో ఎదురుగా ఆటో రావడంతో ఆటో తప్పించపోయిన బస్సు డ్రైవర్ బస్సును రోడ్డు పక్కకు తీసుకెళ్లడంతో అది గట్టు పైకి ఎక్కింది. ఏమాత్రం కొంత ముందుకు కదిలితే బస్సు రోడ్డుపై పడిపోయేదని ప్రయాణికులు తెలిపారు. ఈ ఘటన జరిగిన సమయంలో బస్సులో 60మంది ప్రయాణికులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పోలీస్ ఈవెంట్స్‌లో 559మంది ఎంపిక

నల్లగొండ క్రైం: పోలీసు ఉద్యోగాల భర్తీలో భాగంగా పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఈవెంట్స్‌లో సోమవారం 559మంది ఎంపికయ్యారు. మొత్తం 1332మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 1159మంది హాజరయ్యారు. ఈవెంట్స్‌ను స్పెషల్ ఎస్పీ శబరీష్ పర్యవేక్షించారు.

యువకుడి దారుణ హత్య

- తలపై ఇనుప పైపుతో కొట్టి చంపిన నిందితుడు
- అసభ్య పదజాలం ఉపయోగించి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలపడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం
- తడకమళ్ల గ్రామంలో ఘటన


సుధాకర్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: అసభ్య పదజాలం ఉపయోగించి న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి యువకుడి హత్యకు దారితీసిన ఘటన మిర్యాలగూడ మండలంలోని తడకమళ్ల గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తడకమళ్ల గ్రామానికి చెందిన జంగాల నర్సయ్య, నర్సమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. నర్సయ్య గతంలోనే చనిపోగా, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడి పెళ్లిళ్లు అయ్యాయి. చిన్న కుమారుడు జంగాల సుధాకర్ (28) సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పీవీసీ పైపుల కంపెనీలో పనిచేస్తూ తల్లికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. సుధాకర్ ఆదివారం రాత్రి 10గంటల సమయంలో తన స్నేహితులు ఎర్ర నాగరాజు, ఎర్ర భానుతో కలిసి తడకమళ్ల గ్రామ బస్టాండ్ వద్దకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలోనే తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన చిటికెల సోమయ్య కుమారుడు మల్సూర్ పాత పరిచయంతో సుధాకర్‌ను అడ్డగించి అసభ్య పదజాలం ఉపయోగించి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పాడు. సుధాకర్ కూడా అదే రీతిలో అసభ్య పదజాలం ఉపయోగించి మల్సూర్‌కు తిరిగి శుభాకాంక్షలు చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్యన మాటామాట పెరిగి వాగ్వాదం జరిగింది. అనంతరం సుధాకర్ తన స్నేహితులు నాగరాజు, భానుతో కలిసి నడుచుకుంటూ ఇంటి వైపు వెళ్తుండగా మద్యం మత్తులో ఉన్న మల్సూర్ వెనుక నుంచి వెళ్లి ఇనుప పైపుతో సుధాకర్ తలపై గట్టిగా కొట్టడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఇది చూసిన సుధాకర్ స్నేహితులు ఒక్కసారిగా కేకలు వేయడంతో మల్సూర్ పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న సుధాకర్ తల్లి ఘటనా స్థలం వద్దకు చేరుకుని స్థానికుల సహకారంతో 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే సుధాకర్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ..

హత్య జరిగిన విషయం తెలుసుకున్న మిర్యాలగూడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ సత్యనారాయణ తడకమళ్ల గ్రామానికి వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడి వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందు జాగ్రత్తగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తడకమళ్లలో వాడపల్లి ఎస్‌ఐ రవికుమార్, , తక్కెళ్లపాడులో మాడుగులపల్లి ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయించారు. నిందితుడు మల్సూర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

మాల మహానాడును బలోపేతం చేస్తాం

- సంఘం రాష్ట్ర కార్యదర్శి పిడతల శ్రీనివాస్


శంకర్‌రావుకు నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్

కోదాడ అర్బన్: తెలంగాణలో మాల మహానాడును మరింత బలోపేతం చేస్తామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పిడతల శ్రీనివాస్ అన్నారు. సోమవారం కోదాడలో ఏర్పాటు చేసి మాలమహానాడు ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పట్టణ మాల మహానాడు కమిటీ అధ్యక్షుడిగా పిడతల శంకర్‌రావును నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లచ్చిమల్ల రామ్మోహన్‌రావు, అంబేద్కర్ మాలమిత్ర అసోసియేషన్ అధ్యక్షుడు మున్సిపల్ డీఈ లచ్చిమల్ల పిచ్చయ్య, వాస్తు రేఖ నాగేశ్వరరావు, హనుమంతరావు, పాలడుగు నాగరాజు, అంబేద్కర్ యూత్ సభ్యులు లచ్చిమల్ల అంజి, ప్రవీణ్, ఉపేందర్, వంశీ, శివ, జాన్, పుల్లయ్య, నాగార్జున, కిరణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి

చివ్వెంల (సూర్యాపేట) : గ్రామాల్లో నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని డీఎల్‌పీఓ సాంబిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పాశ్యానాయక్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి మాట్లాడారు. క్యాష్ బుక్ రాయకుండా చెక్ చెల్లింపులు చేయవద్దన్నారు. పల్లె ప్రకృతి వనాలు పరిశుభ్రంగా చూడాలన్నారు. మండల స్థాయి అధికారి విజిట్ తర్వాత గ్రామాల్లో మార్పులు ఉండాలని సూచించారు. నెలకోసారి గ్రామ పంచాయతీ కార్యదర్శి సమావేశం నిర్వహించాలని, కోరమ్ సరిపడా లేకపోతే మరుసటి రోజు నిర్వహించాలన్నారు. ఇంటి పన్నుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ. టి.గోపి, పంచాయతీ కార్యదర్శి గణపరాపు మధు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి


టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కోదాడ అర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలు వెంటనే చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యకుడు పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎన్.నాగేశ్వర్‌రావు, పొరస్పందన వేదిక రాష్ట ఉపాధ్యక్షురాలు కేపీ. మంగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో టీఎస్ యుటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను, డైరీలను వారు ఆ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్‌లో ప్రభుత్వమే అల్పాహారం ఏర్పాటు చేయాలన్నారు. మన ఊరు- మనబడి నిధులు మంజూరు చేయాలన్నారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఆడిట్ కమిటీ సభ్యులు జనార్దన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, కృష్ణయ్య, వివిధ మండలాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌తో సమస్యలు పరిష్కారం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆలేరు రూరల్: ప్రజా దర్బార్ ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నాలుగు చక్రాల వాహనాలు కలిగిన ఉన్నారనే కారణంగా తమకు ఆసరా పింఛన్ నిలిపివేశారని పలువురు ప్రజా దర్బార్ దృష్టి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈ సమస్యలను డీఆర్‌డీఓ ఉపేందర్ రెడ్డికి వివరించగా విచారణ జరిపారని, నియోజకవర్గ వ్యాప్తంగా 159 మంది (గతంలో రిజక్టు అయినవారు) అర్హులుగా తేల్చారని తెలిపారు. దీంతో వారిందరికీ నాలుగు నెలలుగా నిలిచిపోయిన పింఛన్ మొత్తం రూ.13,82,496 వారివారి బ్యాంక్ ఖాతాల్లో సోమవారం జమైందని పేర్కొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాగ్యారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాగ్యారెడ్డి

నేరేడుచర్ల : బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతిఒక్క కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నేరేడుచర్లలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ పట్టణ, మండల శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో రానున్న ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు సైనికుల్లా పని చేయాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూనే కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలన్నారు. ఈ నెల 7న హుజూర్‌నగర్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్‌గా నిర్వహించే సమావేశంలో కార్యకర్తలంతా పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పార్థనబోయిన విజయ్‌కుమార్, వంగవీటి శ్రీనివాస్‌రావు, నరేష్‌గౌడ్, రామ్మూర్తి, నాగిరెడ్డి, శ్రీనివాస్, రాజేష్‌రెడ్డి, సతీష్, నరేందర్‌రెడ్డి, సత్యం, మధుసూధన్ రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, బగ్గిరెడ్డి, పరమేష్‌రెడ్డి, శ్రీను, వెంకన్న, సతీష్, వెంకట్‌రెడ్డి, వెంకటేశం ఉన్నారు.

క్లుప్తంగా

దాతల సహకారం అభినందనీయం

రామన్నపేట : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని వెల్లంకి సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇడెం స్వరూప స్మారక సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులకు టై, బెల్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఇడెం శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు భిక్షంరెడ్డి, గంజి రంగయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో రాణించాలి

బొమ్మలరామారం : ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో రాణించాలని ఆ సంఘం మండల నాయకుడు రాగుల బల్‌రాం అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ముదిరాజ్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గొడుగు శోభ చంద్రమౌళి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుషంగల సత్యనారాయణ, దండు యాదగిరి, ఎలబోయిన రవిశంకర్, కుక్కదువ్వ గణేష్, కూర వెంకటేష్, పండుగ ప్రభాకర్, అమరేందర్, పుల్లూరి పాండు, ప్యారారం పాండు శంకర్, అంజయ్య, మహిపాల్ పాల్గొన్నారు.

అమ్మఒడి ఆశ్రమంలో అన్నదానం

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని వంగపల్లి గ్రామంలోని అమ్మఒడి అనాథాశ్రమంలో మహబూబ్‌పేట గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు జెల్లా శంకర్, అయ్యప్ప మాలధారులు కసాగు వెంకటేష్, ఎల్లంల మహేష్, శిక మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు(ఎం): ఆత్మకూర్(ఎం) ఎంఈఓగా శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూర్(ఎం) ఎంఈఓగా విధులు నిర్వహించిన లక్ష్మీనారాయణ ఇటీవల స్వచ్ఛంద పదవి విరమణ చేశారు. గుండాల ఎంఈఓ విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌ను ఆత్మకూర్ (ఎం) ఎంఈఓగా నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

సంతకాల సేకరణ

రామన్నపేట : డాక్టర్ విశారధన్ మహారాజ్ చేపట్టిన స్వరాజ్య పాదయాత్ర పది వేల కిలోమీటర్లు చేరుకుంటున్న సందర్భంగా సంఘీభావంగా సోమవారం దళిత శక్తి ప్రోగ్రాం జిల్లా అధ్యక్షుడు నల్ల నరేంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి నరేంద్ర మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యం

చౌటుప్పల్ : పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని 11వ వార్డు కౌన్సిలర్ పోలోజు శ్రీధర్‌బాబు అన్నారు. వార్డు పరిధిలో నిర్మించనున్న ఓపెన్ డ్రెయినేజీ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బీబీనగర్: మండలంలోని భట్టుగూడెం, జమీలాపేట గ్రామాల్లోపి ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు– మన బడిలో భాగంగా చేపట్టిన పనులను సోమవారం ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బాల చందర్, సర్పంచ్ మాదవిపురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

భువనగిరిటౌన్ : ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు అన్నారు. భువనగిరి ఏరియా ఆస్పత్రిని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వినతి

భువనగిరిటౌన్ : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జర్నలిస్టులతో జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో జర్నలిస్టుల సమస్యలపై టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు యంబ నర్సింహులు ఆధ్వర్యంలో పలు సమస్యలు కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి కర్ణాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మరాటి రవి, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ మెంబర్ వెలిమినేటి జహంగీర్, చెన్నయ్య, రాయిగిరి మల్లేశం, జమాలుద్దీన్, నాగరాజు, మల్లేశం, చరణ్, ఇషాక్, లక్ష్మినారాయణ, శ్రీనివాస్, కుమార్, కిషన్, శివకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి

భువనగిరిటౌన్ : జైని మల్లయ్యగుప్తా స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని సీపీఎం సీనియర్ నాయకుడు రఘుపాల్ అన్నారు. దుంపల మల్లారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధులు జైని మల్లయ్యగుప్త సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గూడూరు అంజిరెడ్డి, రాచకొండ జనార్దన్, రామచంద్రయ్య, నర్సింహ, బాలరాజు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు



భువనగిరి : వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



భూదాన్‌పోచంపల్లి : శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో..

భువనగిరి : పట్టణంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ దేవిభూదేవి విష్ణు మూర్తుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సత్యం, ఘటాని, మంచాల ప్రభాకర్, శ్రీనివాస్, రవి, సుదాకర్‌గౌడ్ పాల్గొన్నారు. అలాగే విద్యానగర్‌లోని శ్రీ మురళీ కృష్ణ దేవాలయంలో సహస్ర విష్ణు నామార్చన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి వెంకటేష్, అధ్యక్షుడు పసుపునూరి మనోహర్, సభ్యులు వెంకటరమణ, నవీన్, రాజు, యాదగిరిరెడ్డి, కృష్ణరెడ్డి ఉన్నారు. అదే విధంగా పట్టణంలోని శ్రీ పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కాలేరు లక్ష్మణ్‌రావు, ప్రధాన పూజారి నాగరాజు శర్మ పాల్గొన్నారు. పట్టణంలోని నల్లగొండ చౌరస్తాలోని రామాలయం ,కన్యకాపరమేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను నిర్వహించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామపరిధిలో గల రమణేశ్వరంలో గల శివశక్తి శిరిడి సాయి అనుగ్రహ మహాపీఠంలో ఘనంగా ముక్కోటి ఏదాదశి మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమణానంద మహర్షి భక్తులకు పలు బోధనలు చేశారు. నమాత్‌పల్లి గ్రామంలో గల శ్రీ పూర్ణగిరి లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయంలో స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, రాములు, పవన్ కుమార్ శర్మ, మంగమ్మ, ఆంజనేయులు, జంగయ్య పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని కనుముకుల గ్రామంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పుష్పాలంకరణ చేసి చేశారు. పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో స్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం విష్ణు సహస్ర నామాస్తోత్ర పారాయణం, గోదాలక్ష్మీదేవి కుంకుమార్చన, మంగళశాసనం, నివేదన చేశారు. ఆయా కార్యక్రమాల్లో దేవాలయ కమిటీ చైర్మన్ యాదగిరి, రఘు,ఉభయాకర్, ప్రకాశ్, గుర్రం రామకృష్ణ, లక్ష్మీకాంత్, జానకిరాములు, శ్రీకాంత్, మహేశ్, మల్లేశ్, చిన్న నర్సింహ పాల్గొన్నారు.



మోత్కూరు : దాచారంలో..

గుండాల : మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామి ఉత్తర ద్వారం గుండా దర్శనమిచ్చారు. కార్యక్రమంలో అనిల్‌శర్మ, బాలలింగం, శంకర్ పాల్గొన్నారు.

రాజాపేట : మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో, రఘునాథపురం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, మండలంలోని పాముకుంట గ్రామంలో గల పన్నెండు పడగల శ్రీ వేంకటేశ్వరస్వామి, దేవాలయాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశి పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామి వారి ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకున్నారు.

చౌటుప్పల్ : మండల వ్యాప్తంగా పలు ఆలయాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారు భక్తులకు ఉత్తర ద్వారం గుండా దర్శనమిచ్చారు. పట్టణ కేంద్రంలోని శ్రీబాలాజీ రామకృష్ణ దేవాలయంలో ఆలయ చైర్మన్ సుర్కంటి మహేందర్‌రెడ్డి–ఉమ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రామన్నపేట : కుంకుమార్చన చేస్తున్న భక్తులు

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, రామలింగేశ్వర స్వామి, సాయిబాబా, పెద్దమ్మ తల్లి దేవాలయాలతో పాటు మండలంలోని దాచారం గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాచారం సర్పంచ్ అండెం రజిత, మాజీ ఎంపీటీసీ సూరారం యాదగిరి, దేవాలయ ధర్మకర్త అక్కెనపల్లి వాసుదేవరావు, చింతల నర్సిరెడ్డి, వల్లభాయ్ పాల్గొన్నారు. మున్సిపల్ కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఎస్ఐ వి.జానకిరాంరెడ్డి –మౌనిక దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రు గౌడ్ , రాజు, యాదగిరి, శ్రీనివాస్, జనార్దన్, అంజయ్య, సీతయ్య, రవి, అంజయ్య, రంగయ్య, డి.శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండలం వ్యాప్తంగా పలు ఆలయాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామంలో గల శ్రీ తిరుమల నాథ స్వామి ఆలయం, పెద్ద పర్వతాపూర్‌లోని సాయిధామం సాయిబాబా ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చౌటుప్పల్ : బాలాజీ రామకృష్ణ ఆలయంలో..

తుర్కపల్లి: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గల వెంకటగిరి లక్ష్మీ నర్సింహా స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం సుదర్శన హోమం నిర్వహించారు. కార్యక్రమంలో వంశపారంపర్య పురోహితులు రమాకాంత్‌శర్మ, రాఘవచార్యులు పాల్గొన్నారు.

రామన్నపేట : మండలకేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంతోపాటు, సిరిపురం శ్రీ సీతా రామాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రామన్నపేటలో గోదాదేవి అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం, జెడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్మోహన్, సర్పంచ్‌లు గోదాసు శిరీషా పృథ్వీరాజ్, అప్పం లక్ష్మీనర్సు, ఎంపీటీసీ బడుగు రమేష్, గొరిగె నర్సింహ, ఆలయచైర్మన్లు లవనం ఉపేందర్, రాపోలు స్వామి, ఉపసర్పంచ్‌లు పోడిచేటి కిషన్, దాసిరెడ్డి శ్రవన్‌కుమార్, గంజి నరేష్, రాములు, లింగయ్య, రామేశ్వరం, నర్సింహ, అంజయ్య, శ్రీనివాస్, డోగిపర్తి సుబాస్, తాటికొండ సూర్యనారాయణ పాల్గొన్నారు.



తుర్కపల్లి: సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు



గుండాల : వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రాజాపేట : వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రామన్నపేట : సిరిపురంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రామన్నపేట అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట : రామన్నపేట పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం చెన్నకేశవస్వామి ఆలయంలో జరిగిన వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి సిరిపురం చౌరస్తా వరకు చిట్యాల –భువనగిరిరోడ్డు విస్తరణ, సెంట్రల్‌లైటింగ్ ఏర్పాటుకు రూ. 10కోట్లతో ప్రతిపాదనలతో సీఎం కేసీఆర్‌ను కలువడం జరిగిందన్నారు. త్వరలో నిధులు మంజూరు అవుతాయన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం, ప్రసాదం పంపిణీ చేశారు. ఆయనవెంట ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీ, జెడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్మోహన్, ఎంపీటీసీ గొరిగె నర్సింహ బీఆర్ఎస్ పట్టణఅధ్యక్షుడు పోతరాజు సాయి, మల్లేశం, ఉపసర్పంచ్ పోడిచేటి కిషన్, మార్కెట్ వైస్‌చైర్మన్ కమ్మంపాటి శ్రీనివాస్, నీల దయాకర్, ముత్యాల సుజాత, బద్దుల రమేష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసీస్ సెంటర్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ డయాలసీస్ సెంటర్ ప్రారంభోత్సవానికి మంగళవారం రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిలు రానున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ అలివేలుకు పలు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, పాలియేటీవ్ కేర్ ఇన్‌చార్జ్ డాక్టర్ కాటంరాజు, కౌన్సిలర్లు ఎండీ.బాబాషరీఫ్, బండమీది మల్లేష్, లింగస్వామి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుర్వి మల్లేష్, గుండెబోయిన వెంకటేష్, బొడిగె బాలకృష్ణ, కె.శ్రీనివాస్, బి.స్వామి, వల్లందాసు సతీష్, గంగరాములు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆది మహావిష్ణు కల్యాణ మహోత్సవం

చౌటుప్పల్ : మండల పరిధిలోని దేవలమ్మనాగారం గ్రామంలోని శ్రీ ఆది మహావిష్ణు దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని వీక్షించారు. అదే విధంగా భక్తులు స్వామి వారిని ఉత్తర ద్వారం నుంచి దర్శనం చేసుకున్నారు. ఆలయ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి–పుష్పలత దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ మహోత్సవ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.



భక్తులకు తాళిబొట్టు చూపిస్తున్న పురోహితుడు

నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



యాదగిరిగుట్ట : డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీత

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన సంవత్సర డైరీని సోమవారం మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, వినయ్‌భాస్కర్‌లు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఓ గీతారెడ్డి , ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రామన్నపేట : టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సోమవారం ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీ, ఎంపీడీఓ గాదె జలేందర్‌రెడ్డిలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కంచి రవికుమార్, సిలువేరు అనిల్‌కుమార్, సత్యనారాయణరాజు, మంకాల కుమారస్వామి, టేకుల మల్లారెడ్డి, లలిత, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వలిగొండ : మండల కేంద్రానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. పిట్టల సంగీతకు రూ.40 వేలు, కంకల శ్రీనివాస్‌కు రూ.36 వేలు, మూతి నర్సింహకు రూ.36 వేలు, కల్కూరి నరసింహ కు రూ.19 వేలు మంజూరైనట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్సం రమేష్, మామిళ్ల రత్నయ్య, గంగదారి రాములు, లింగస్వామి, సత్యనారాయణ, శ్రీరాముల నాగరాజు, వెంకటేశం, పల్సం రాజు, శాంతికుమార్, ప్రభాకర్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోటకొండూర్: మండల కేంద్రానికి చెందిన వంగ సునీతకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.40వేల చెక్కును సోమవారం బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఎగ్గిడి బాలయ్య, నర్సింహ, మల్లయ్య, రేగు అంజయ్య భూమండ్ల అయిలయ్య, లింగం పాల్గొన్నారు.

అడ్డగూడూరు : మండల పరిధిలోని లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన దామెర్ల కోటయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 60 వేల చెక్కును సోమవారం ఎంపీపీ దర్శనాల అంజయ్య , బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, వెంకటేశ్వర్ల, నర్సింహారెడ్డి, కిరణ్, నరేందర్, పరమేష్, భా స్కర్, సైదులు పాల్గొన్నారు.



వలిగొండ : చెక్కులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్ఓసీ అందజేత

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన గవ్వల లావణ్యకు మంజూరైన రూ.1.50లక్షల ఎల్ఓసీని సోమవారం ప్రభుత్వ విప్ గొంగిడి సునీత బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగరాజు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండలంలోని మొరిపిరాలలో ఎత్తరి పద్మకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కును సర్పంచ్ సామ తిరుమలరెడ్డి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చిప్పలపెల్లి యాదగిరి, పంచాయతీ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.2లక్షల విరాళం

బీబీనగర్: మండలంలోని వెంకిర్యాల గ్రామంలో పునర్నిర్మాణం చేపడుతున్న శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి సోమవారం బీఆర్ఎస్ నాయకుడు పింగళిరెడ్డి రూ.2లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీబీనగర్ సర్పంచ్ మల్లగారి భాగ్యలక్ష్మిశ్రీనివాస్, ఆలయ చైర్మన్ రాచమల్లు శ్రీనివాస్, ధర్మకర్తలు అశోక్‌కుమార్‌గుప్తా, సద్గుణ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ పార్టీ నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు సోమవారం స్థానిక రైతు బజార్ వద్ద సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పోత్నక్ ప్రమోద్‌కుమార్,జహంగీర్, నర్సింహ, ప్రదీప్, వెంకటేష్, భాస్కర్, మనోజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలేరురూరల్ : కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద సోమవారం తలపెట్టిన ధర్నాకు తరలివెళ్తున్న స్థానిక కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎంఎ ఎజాజ్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నీలం వెంకటస్వామి, జిల్లా మహిళ అధ్యక్షురాలు నీలం పద్మ మాట్లాడుతూ నిరసన కార్యక్రమానికి వెళ్తున్న వారికి అరెస్టు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతలపణి సునీతశ్రీనివాస్‌రెడ్డి, సింగల్ విండో డైరక్టర్ కట్టిగొమ్ముల సాగర్‌రెడ్డి, ఉప్పలయ్య, యాదగిరి, లోకేష్, విక్రమ్, అజయ్, భాస్కర్ పాల్గొన్నారు.

వలిగొండ : స్థానిక సంస్థలకు నిధులివ్వకుండా నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద సోమవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి తరలివెళ్తున్న ఆ పార్టీ నాయకులను మండలకేంద్రంలో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో పాశం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, ఖుర్షీద్, బతిని లింగయ్య, జంగం శంకరయ్య తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నా కు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను మండల కేంద్రంలో సోమవారం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ గర్షకోట మధు తెలిపారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖరరెడ్డి, నాయకులు బాషబోయిన పాపయ్య, ముద్దసాని సిద్దులు, కట్టెకెల హన్మంతు గౌడ్, పోతగాని మల్లేశం గౌడ్, సర్పంచ్‌లు ఉన్నారు.



మోత్కూరు : అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

మోత్కూరు : పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ పీసీసీ అధ్యక్షుడు ఏనుముల రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు హైదరాబాద్ ధర్నా కార్యక్రమానికి తరలివెళ్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులను సోమవారం స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కారుపోతుల వెంకన్న గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, మందుల సురేష్, అవిశెట్టి కిరణ్, పట్టూరి అంజయ్య, బందారపు పవన్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం : ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమానికి తరలివెళ్తున్న నాయకులను సోమవారం స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగిర్తి మల్లేష్, జూపల్లి శ్రీకాంత్, ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, నాగిరెడ్డి ప్రేమ్ రెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

చౌటుప్పల్ : కాంగ్రెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో సోమవారం నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి తరలివెళ్తున్న మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడిచిపెట్టారు.



చౌటుప్పల్ : రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన నిరసనకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో లందగిరి భీమయ్య, నర్సింహ, రాచకొండ భార్గవ్, శ్రీనివాస్, లింగస్వామి, ఊదరి శ్యామ్, ఖయ్యూం, నర్సింహ, శ్యామకూర రాజయ్య, లింగస్వామి, జానిబాబు పాల్గొన్నారు.

తుర్కపల్లి: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్‌గౌడ్, వెంకటేశ్‌యాదవ్, ఆకుల సతీష్‌కుమార్, సురేశ్, శ్రీనివాస్, రమేశ్‌నాయక్, యాదగిరి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని భావనారుషిపేట పద్మశాలీ సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భారత గిరివాసు, ఉపాధ్యక్షుడిగా పగడాల పాండు, ప్రధానకార్యదర్శిగా కోడి బాలరాజు, సహాయ కార్యదర్శిగా భానుప్రకాశ్, కోశాధికారిగా నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా నాగయ్య, వీరేశం, బింగి రాజు, వైకుంఠం, రమేశ్, రవీందర్ ఎన్నికయ్యారు. నూతన కమిటీని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, కౌ న్సిలర్ దేవరాయ కుమార్, సీత శ్రవన్, చంద్రశేఖర్ సన్మానించారు. కార్యక్రమంలో చంద్రమౌళి, సీత సత్యనారాయణ, శ్రీశైలం, పాండురంగ శాస్త్రి, దుర్వాసులు, చెన్నకేశవులు, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

రాజాపేట : మండలంలోని రఘునాథపురం గ్రామాన్ని మండలం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం, జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష సోమవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుడిగె రేణుక పెంటయ్య గౌడ్, ఉప సర్పంచ్ పాండు, లక్ష్మీపతి, వెంకటేశం, సిద్దులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వలిగొండ : మండలంలోని వేములకొండకు చెందిన మంటిపెల్లి మల్లయ్య అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. దీంతో సోమవారం స్థానిక సర్పంచ్ బోడ లక్ష్మీబాలయ్య మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కేసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, యాదవ సంఘం అధ్యక్షుడు ఎనుగుల కిష్టయ్య, ఏర్పుల గంగయ్య, బండ సందయ్య, మంటిపెల్లి రమేష్, మల్లయ్య, ఏర్పుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ తీరుపై సోమవారం పట్టణ కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో పాష, నర్సింహ, శ్రీశైలం, ధర్మయ్య, దాసు, అంజిరెడ్డి, ఊషయ్య, జనిగల మల్లేశం, మల్లేశం, ఎండీ.ఖయ్యూం ఉన్నారు.

ఎమ్మెల్యే గొంగిడి సునీతను కలిసిన నాయకులు

ఆలేరురూరల్ : ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య సోమవారం స్థానిక ఎమ్మెల్యే, విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డిని తన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పత్తి వెంకటేష్, చిమ్మి శివమల్లు, ఆలేటి అనీల్, శ్రీకాంత్, సంతోష్, గణేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డిని సోమవారం మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఉప్పలయ్య యాదవ్ ఉన్నారు.

కరపత్రం విడుదల

సంస్థాన్ నారాయణపురం: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం క్రీడా పోటీల నిర్వాహకులు పాశం రాములు, బాకారం నాగరాజులు ఆవిష్కరించారు. పూర్తి వివరాలకు 9949582816, 9848741889, 9908711325 నంబర్లను సంప్రదించాలన్నారు.